# పాత చొక్కా – లవలి

"పువ్వులా పుట్టి, పువ్వులా పరిమళించి, పువ్వులా రాలిపోవాలి"

" "

"అలా రాలిపోవడానికి ఎంత పుణ్యంచేసుకు పుట్టాలి ?"

" "

"అలా నవ్వకురా విస్సీ ! అందుకే అంటాను నీకేంవిటని ఆశపెట్టి నీ వాళ్ళందర్నీ మురిపించ గలిగినంత డబ్బు పోగేసి బ్యాంకులో దాచుకున్నావు నీ కనుసన్నల్లో మెలుగుతూ అడుగులకు మడుగు లొత్తే కొడుకూ కోడలూను 'తాతయ్యా ! తాతయ్యా !' అంటూ "

ఎంతవిచిత్రం !! నిన్న ! నిన్నంటే నిన్ననే ఈ చెరువు గట్టుమీద నా ఎదురుగా కూర్చొని లోతయిన కళ్ళు కమ్మిన కన్నీటి పొర మాటున మిలమిల లాడుతూ వుండగా ఈ మాటలు వత్తి వత్తి పలికిన శేషు– ఈ రోజున ఈ లోకానికి దూరంగా– అందుకోలేనంత దూరంగా వెళ్ళిపోయాడంటే నమ్మ లేకపోతున్నాను

ఇంకా వాడు నా యెదురుగా కూర్చున్నట్లే అనిపిస్తోంది ! వాడి మాటలు నా చెవుల్లో మారు మోగుతూనే వున్నాయ్

నిన్న వాడి మాటల్ని నేనంతగా పట్టించుకో లేదు ఏదో మామూలుగానే అంటున్నాడనుకున్నా

ఇపుడు తెలుస్తోంది వాడి మాటల్లోని అర్థం వాడు మరణాన్ని యింత యిదిగా కోరుకున్నాడా ?

కోరుకోక ఏంచేస్తాడు ?

కొందరి జీవితాలింతేనేమో ! పాపం శేషు !

మిత్రుడు శేషు జ్ఞాపకాలతో ఆర్ద్రమైన కళ్ళతో అశ్రుతర్పణంచేసి కొంచెం తేరుకున్నాను

ఈనాటిదా ? మా అనుబంధం

అ–ఆ ల దగ్గర్నుండి వుద్యోగంలో రిటైరయ్యే దాకా, తర్వాత నిన్నటిదాకా ఒకే బోగీలో ప్రయాణం చేశాం వాడి స్టేషను వచ్చేసింది ! దిగిపోయాడు నన్నొదిలేసి గుడ్‌బై కూడా చెప్పకుండా !

వాడి మాటల బటానీలు నవులు_ నేనింకా ప్రయాణం చేయాలి !

అందరూ 'శేషగిరిరావూ' అని పిలిస్తే నేను వాడ్ని 'శేషూ !' అనేవాడ్ని

బళ్ళో మాష్టారు కూడా "విశ్వేశ్వరరావూ" అని పిలిస్తే నన్ను "విస్సీ" అని పిలిచేవాడు మా శేషు

సరదాకయినా మేం ఎప్పుడూ మాటా మాటా అనుకోలేదు అరవయి సంవత్సరాలు దాటిపోయినా మా స్నేహం నవనవలాడుతూనే వుంది అంత అన్యోన్యంగా వుండేవాళ్ళం

ఆరుగురాడపిల్లలూ ఒక్క మగపిల్లవాడూను మా శేషుకి నాలుగు డబ్బులు వెనకేసుకోలేక పోవడానికి కారణం వాడంతమంది పిల్లల్ని కనడమే



ఆరుగురాడపిల్లల్నీ ముస్తాబు చేసి సాగనంపే సరికి వున్న కాస్తంత చిరాస్తీ కరగిపోయింది

ఎట్లాగయితేనేం కష్టపడి కొడుకుని ప్రయోజకుణ్ణి చేసి తండ్రిగా తన బాధ్యతల్ని తీర్చుకుని తాను వడ్డెక్కాడు

"ఈ జగన్నాటకంలో నా పాత్రను ఇప్పటి వరకూ నలుగురూ మెచ్చుక నేట్లు బాగానే పోషించానని అనుకుంటున్నానురా ! ఇంక ఓపిక లేదురా ! ముందు ముందు తృప్తిగా నటించలేనేమో ! ఆ సూత్రధారి నా పాత్రకు తొందరగా నిష్క్రమణ చెపితే బాగుండ్ను"

ఈ మధ్య తరచు యీ డైలాగులు చెపుతూండేవాడు విని నేను నవ్వేస్తుండే వాడ్ని

ఏంవిటో ! నన్నేకాదు ఎవర్నీ ఎప్పుడూ దేబిరించి పది రూపాయలు బదులడిగేవాడు కాదు మా శేషు బదులడిగితే తప్పని కాదు అదో పద్ధతి వాడిది

"అప్పు చేయడానికి ప్రయత్నించే దైన్యాన్ని నటించడం నాకు చేతకాదురా !" అనేవాడు

అంత గొప్ప జీవిత నటకుడైయుండీను అయినా నా దృష్టిలో వాడు కొంచెం ఖర్చు మనిషే ! అన్నివేళలా చిరునవ్వుతో నిండుకుండలా వుండేవాడు

అటువంటివాడు వున్నట్టుండి వోనాడు నా ముందు ఎంతో దీనంగా తనగోడు వెళ్ళబోసు కున్నాడు

నాకు చాలా ఆశ్చర్యం వేసింది ఈ శేషుకీ ఆ శేషుకీ ఎంత తేడా వుందీ ! అని

చెప్పొద్దూ ! నాకు బాధలంటే ఏంవిటో అనుభవంలోకి రాకుండానే షష్టిపూర్తి చేసు కున్నాను చదవడమో లేక చెబితే వినడమో అంతేగాని నాకు బాధ అంటే ఎలా వుంటుందో అనుభవంలో తెలవదు– ఈమధ్య సతీవియోగ బాధ సంభవించే వరకూ

వుద్యోగంలోంచి రిటరయినదగ్గర్నుంచీ వాడి బాధలు మొదలయ్యాయిట కొడుకు దగ్గరే, పుట్టి పెరిగినచోటే వుంటున్నాడు

ప్రావిడెంటుఫండూ, గ్రాట్యుటీ, అవీ ఇవీ గలగల్లాడిన నాళ్ళోజులూ బాగానే గడిచింది ఆ తర్వాతే యింట్లో అందరి మొహాలూ వెలిసిపోవడం మొదలైందిట

"మొహాలే కాదురా మా యింట్లో అందరి మనస్సులూ వెలవెలపోయి బోసిగా తయారయ్యాయి నేనేమో ఎప్పుడూ మొహాల రంగులకే ప్రాధాన్యత నిచ్చే జీవిత నటుకుణ్ణే వాళ్ళు మొహాలకే కాకుండా మనస్సులకి కూడా రంగుపూసుకోకుండా ప్రవర్తిస్తు లిచ్చేస్తున్నారు ఎవరో అయితే బాధపడను నా చేతులలో పెరిగిన నా కన్నకొడుకే నా మొహంరంగు కడిగేస్తానంటే ఎట్లా వుంటుంది ? చెప్పరా !

కూరయా పచ్చడి విస్తట్లోకి విసిరిపడేసి– అన్నం విస్తరంతా చిందేలా విసిరికొడ్తే మా కోడల్ని గొప్ప నటి అని ఎల్లా మెచ్చుకోగలను ? "ముసలాడు రాత్రంతా దగ్గుతూనే వున్నాడు ఈ పూట ఆయనగారు తింటే ఇంక ఈ రాత్రి నేను నిద్ర పోయినట్టే ! ఊఁ ! మీరు లేవండి !" అని మొగుడ్ని భోజనానికి పిలిచే మా కోడలి మాటలకి ఏడవాలా ?

"ఆడపిల్లలు – ఆడపిల్లలు – అంటూ ఉన్నదంతా ఊడ్చిపెట్టాడు తీసికెళ్ళి, పట్టుమని పదిరోజు లుంచుకుందికి వాళ్ళకీ తీరికా లేదు అనుభవం వాళ్ళదీ – ఆయాసం నాదీను ఈ పీడ ఎప్పుడు విరగడవుతుందో ?" అన్న నా కొడుకుని చూసి నవ్వాలా ? చెప్పరా, నువ్వు !"

అప్పుడు వాడి మాటల్ని నవ్వుతూ కొట్టి పారేశాను "సర్దుకుపోవాలిరా ! నీకు నేను నటన గురించి చెప్పాలా ?" అని తేలిగ్గా అనేశాను

తవ్వుకున్న కొద్దీ మాతిలో జలలా ఈ దుఃఖం అధికం అవుతుందిగానీ తరగదు మరి – మా శేషు మరణం సహజమైనదేనా ?

జవాబు దొరక్క దిక్కులు చూస్తున్నాను 'కాదు ! కాదు !" అని అవి ప్రతిధ్వనిస్తున్నాయి

తెల్లపోయి ఆకాశంలోకి చూస్తున్నా నీలి మబ్బులు తేలియాడుతున్నాయ్

పక్షులు గూటికి బయలుదేరుతున్నాయ్

పడమర సూర్యబింబం ఎర్రగా – మా 'రమణి' నుదుటి కుంకుమ నా కళ్ళల్లో ప్రతిఫలించినట్టు – చెరువు నీళ్ళల్లో

రమణీ ! నన్నెంత అన్యాయం చేశావ్ నువ్వు ! నా షష్టిపూర్తి వుత్సవంనాడు ఏంవన్నావ్ ?

'కడదాకా మీ అడుగులో నా అడుగు వేస్తా' అన్నావ్ ఆ 'కడ' నాదనుకున్నాను కానీ నీ కడదాకా అని అర్థం చేస కోలెకపోయా

కాస్త ముందూ వెనకానూ ! నేనూ వస్తా ఎంత దూరం పోయినా నిన్ను కలుస్తా !

నీ పేరు పెట్టుకున్న మనవరాలే నాకు తోడు లేకపోతే ఇలా వంటరిగా దొర్లించగలనా రోజులు, కొడుకూ కోడలూ ఎంత ప్రేమతో చూసుకుంటే మాత్రం ?

ఇంటికి రావడం – స్నానం చేయడం – సంధ్య వార్చడం – భోజనం చేయడం – మేను వాల్చడం – మనవరాలితో ముచ్చట్లాడడం – అన్నీ అన్యమనస్కం గానే జరిగిపోయాయి యీ పూట

రోజూ మనవరాలు చెప్పే కబుర్లకి ఊఁ కొడుతూనే నన్ను నిద్ర కమ్మేసేది కమ్మగా

ఇవ్వాళ అస్సలు నిద్ర పట్టడం లేదు

"ఎవరి కెవరూ " ఏదో వైరాగ్య గీతం వినవస్తోంది రేడియోలో

అది మా కోడలు గొంతుక్కాదూ ?

ఆఁ ! అది – అదీ నారక్తం పంచుకుపుట్టిన వాడి గొంతేనా ?

" మనం కూడా ఫ్రిజ్జూ, టి వీ కొనుక్కుందావండీ !"

" ఈ ముసలాడు చచ్చేదాకా మన కా సరదాలు తీరవ్ డియ్యర్ ! "

"ఈ లోగా మనం చావకుండా వుంటే మన సరదాలు తీరినంత ఫలం ! "

" "

" "

"ఏఁవిటి ? ఈ రమణిని చదువూ సంధ్యా లేకుండా మొద్దులా తయారు చేస్తున్నావ్ అస్తమానూ 'తాతయ్యా ! తాతయ్య !' అంటూ వెధవతిరుగుడూ యిదీను దీన్ని అదుపులో పెట్టి చదివించకపోతే బొమ్మలా తయారవుతుంది అప్పుడు దీన్నెవడూ చేసుకోడు ఆఁ ! తర్వాత నీ యిష్టం "

"వూరుకోండి ! మెలుకువగా వున్నాడేమో ! వింటాడు !"

"వింటే ఆ డబ్బు కాస్తా ఏ అనాథాశ్రమానికో ఇచ్చేస్తాడనా నీ భయం ! డియ్యర్ నిజ్జంగా నువ్ సినిమాల్లో చేరివుంటే తారాపథానికి "

అబ్బా !

బాధ అంటే ఇట్టా వుంటుందా ! రమణి నా శరీరాన్ని నిలువునా చీల్చుకుంటూ వెళ్ళిపోయిన నాడు కూడా నాకింత బాధ అనిపించలేదు

ప్రాణంలా చూసుకునే కొడుకూ కోడలూ నాకేఁవిటి ? అని పొంగిపోయాను ఇన్నాళ్ళూ

అదంతా వట్టి భ్రాంతియేనా ? కన్నకొడుకు నిజస్వరూపం యిదా ? ఈ వచ్చి నిజాన్ని భరించగలనా ?

వడగాలికి చిగురాకులా ఇలా విలవిల్లాడి పోతోం దేఁవిటి నా మనస్సు

వాడి మనస్సు లోతుల్లో వున్న కోరిక యిల్లాగ మాటలతో బయట పడింది — ఇంక చేతల్లోకి దిగుతుందా ?

ఛ! ఛ!

ఇది ఆ వయస్సు ప్రభావమా ? లేక మారుతున్న కాల ప్రభావమా ?

నే నిల్లాంటివి ఎరగనే !

తలిదండ్రుల సేవే మహద్భాగ్యం అనుకున్నాను. నా రమణి నన్ను అనుసరించింది

ఇట్లా కన్నకొడుకు మాటలు నా చెవుల్లో గింగుర్మంటూ వుంటే ప్రాణాలు నిలబడేనా ?

చెవులు చిల్లులు పడిపోతున్నాయ్ మనస్సును ములుకులు కెలుకుతున్నాయ్ నా నిట్టూర్పులే నాకు వడగాడ్పుల్లాగ వున్నాయ్

భ్రమల అవనికలు తప్పుకున్నాయి

పర్వత శిఖరంమీద కాదు అగాధంలో అంధకారంలో వున్నాను

ఆశతో వెలుగురేకల కోసం నా కళ్ళు వెతుకుతున్నాయి బాహ్య స్మృతికి దూరంగా— పోతున్నాను

ఎక్కడో ఓ వెలుగు కిరణం పొడిచి నావైపే దూసుకువస్తోంది

ఎవరది ?

నా రమణి !

నాకు జీవంపోసే చిరునవ్వుల ఆమని

నన్నుచేరి మళ్ళీ నన్ను పరిపూర్ణుడ్నిచేస్తోంది

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు ఆ రోజులు !

కాల చక్రం వెనక్కి తిరుగుతోంది !

పరిమళాల వరాలు పొంది వింగిమండి వేలకు జారే వెన్నెల తీవల జాలు !

తియ్యదనాలు సంపాదించుకొని పరుగిడబోయే మలయమారుతాలు ఎదురుగా— నా రమణి— నా పంచప్రాణాలు !

" మిమ్మల్నే ! మీవాడి చూపుల వేడిమికి తాళలేక పోతున్నాను కొంచెం రెప్పపాటు వేయండి స్వామీ !"

" మన్మథుని వింటినారి వంటి కురుల కొసలకు ముడివేసికొని నా ప్రాణాలు నీ గుప్పిటలో పెట్టుకున్నావు గదా ! మరి నాకు రెప్పపాటు ఏ విధంగా సాధ్యమవుతుంది దేవీ !"


"పోనీ ఆ అనిమిషత్వం మీకేనా ? నాకేమైనా ప్రసాదిస్తారా ! అర్థాంగిని అభ్యర్థిస్తున్నాను "

"నేను ప్రసాదించేదేఁవిటి ? నన్ను బాహువల్లరిలో బంధించుకొని నీ అరుణాధరాలతో అందుకోవచ్చును గదా !"

" ఆ గడియారం ఏఁవండీ ! అటు చూడండి ఆ సెకండ్ల ముల్లు ఎంత వేగంగా తిరిగి పోతోందో ! మనకు తెలియకుండానే మనం ముసలివాళ్ళం అయిపోతున్నాఁవండీ !"

"అవునండీ ! ముసలివాళ్ళం అవుతున్నాఁవంటే— అమరులం కాబోతున్నామన్నమాట ! ఇక ఆ పైన అమృతం ! అజరత్వం ! ఇంకా "






## పాత చొక్కా

"ఊఁ! చాల్లెండి మరీ చిన్నతనం — చిలిపితనం పోలేదు మీకు అబ్బాయి వస్తున్నాడు"

కాలచక్రం ముందుకు తిరిగిపోతోంది

"అయ్యో! రమణీ! వెళ్ళిపోతున్నావా! నువ్వి మాట వినలేదు ఎల్లా చెప్పాలి? మన అబ్బాయి మనం కన్న కలల పంట కా దు మోస పోయాం!"

నా గొంతు పెగిలిరాలేదు జీరపోయింది పరుగునపోయి నా రమణి చేయి పట్టుకున్నా గట్టిగా

"తాతయ్యా! లే! నా చెయ్యి నొక్కేస్తున్నావే వదులు! చూడు ఎంత పొద్దెక్కిందో! ఎప్పుడేనా ఇల్లాగ పడుకున్నావా? ఈపాటికి స్నానం సంధ్యా అన్నీ అయి పేపరు కోసం చూసేవాడివి లే! చూడు! ఇవ్వేళ నా పుట్టినరోజు! పట్టుగౌను చూడు! కొత్తది! ఎంత బావుందో!"

బాహ్య స్మృతికి దగ్గరగా వస్తున్నాను కన్నులు విచ్చి మా మనవరాలు రమణిని చూశాను

నటనలేని నవ్వు!

మల్లెపువ్వులాంటి మచ్చలేని మనస్సు! "రమణీ! బీరువాలో "

"బిస్కట్లా తాతయ్యా? అప్పుడే ఎందుకు? నువ్వు స్నానం అదీ ముగించుకొని పాలు తాగాలి! అప్పుడు నేను తినాలి!"

"అదికాదు రమణీ! ముందు బీరువా తాళాలు తియ్యి! ఆఁ! చూడు ఆ అరలో అదే ఆ పుస్తకం పట్రా!"

"ఏం పుస్తకం తాతయ్యా యిది?"

"అదా బ్యాంకు పుస్తకమమ్మా! అది నా ఖాతా మీ నాన్న పేర మార్పించి అవన్నీ నీకెందుకుగానీ ఆ పుస్తకం మీ నాన్న కిచ్చిరా!"

"అల్లాగే! నువ్వు తొందరగా స్నానం చెయ్ నా కాకలేస్తోంది అస్సలే నా పుట్టినరోజు ఇవ్వాళ నేను కొత్త గౌను తొడుక్కున్నాగదా! నువ్వుకూడా కొత్త చొక్కా తొడుక్కోవాలి! ఊఁ!"

"ఓ! అలాగే! అన్నీ తొందరగా ముగించుకొని 'కొత్త చొక్కా' తొడుక్కుంటా"

"వాసాంసి జీర్ణాని "

ఘంటసాల గానం చేసిన గీతమాధురీ లహరి!

నన్ను ముందుకు వెళ్ళనీలేదు

అవునూ! ఈ చొక్కా ఇంకా చివికిపోలేదే!

బాగుచేసుకుందుకు కూడా పనికిరాకుండా పోలేదే!

అప్పుడే ఎల్లా దీన్ని వదిలేయడం?

వాడా? వాడు శేషు — కొత్త చొక్కా మోజులోపడి — పాతది నచ్చలేదని — దాన్ని విసిరి కొట్టాడు వాడా చొరవగలవాడు

మరి నేనూ? నేను పొదుపరి తనానికి అలవాటు పడిన వాడ్ని వాడికున్న చొరవ — అతి చొరవ నాకు లేదు అంతగా ఈ చొక్కా నలుగుడు పడితే బాగుచేసుకుందుకు మనవరాలు రమణి లేదూ సాయం చేయడానికి? అప్పుడే ఈ "పాత చొక్కా" ఎట్లా మార్చగలను?